నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ చెంగిచెర్ల ఫీడర్ల పరిధిలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11కేవీ ఎస్‌బీఎస్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్,కమలానగర్, సుమారెసిడెన్సీ, అయోధ్యకాలనీ, గురు ఎన్‌క్లేవ్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రకటించారు.

◆ 11 కేవీ బుద్ధానగర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధానగర్, మల్లికార్జుననగర్, వరంగల్ హైవే కరెంటు ఉండదన్నారు.

◆ 11 కేవీ వెంకటసాయినగర్ ఫీడర్ పరిధి 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు శివగణేష్‌నగర్, ఎంఎల్‌ఆర్‌కాలనీ, అక్షయనగర్, వెంకటసాయినగర్, సాయిరెసిడెన్సీ, క్రిష్ణానగర్, ఫ్రీవిలేజ్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ 11కేవీ మై విలేజ్ ఫీడర్ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు ఎంఎల్‌ఆర్‌కాలనీ, అక్షయనగర్, వెంకటసాయినగర్, సాయిరెసిడెన్సీ, కృష్ణనగర్, ఫ్రీవిలేజ్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



జలమండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

గౌతంనగర్: వేసవికాలం దృష్ట్యా గౌతంనగర్ డివిజన్ పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ, భవానీనగర్, వాణినగర్, సాయినగర్, గౌతంనగర్, ఉత్తమ్‌నగర్, మల్లికార్జుననగర్‌లో నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని కోరారు. వాసంశెట్టి శ్రీనివాస్, వెంకట్‌యాదవ్, అమర్, వెంకట్‌కిషోర్, వాసుదేవ్, మంజుల, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వేదగణితంలో విద్యార్థిని ప్రతిభ



బోడుప్పల్: విశ్వం ఎడ్యుటెక్ నిర్వహించిన వేదగణితంలో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని దివ్య సేర్వి జాతీయస్థాయిలో తృతీయ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రవణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రత్యేకశిక్షణ ఇప్పిస్తున్నట్లు వివరించారు. వేద గణితంలో విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదునిస్తున్న రామారావును శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నీలిమా ఈ సందర్భంగా అభినందించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎంపీకి ఆహ్వానం



మల్లాపూర్: నాచారం శ్రీరామ్‌నగర్‌లోని బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరుకావాలని, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆలయ దాత శ్రీధర్‌రెడ్డి ఆహ్వానం అందజేశారు. ఈనెల 8 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి గోపాల్‌గౌడ్, చంద్రమౌళి, హన్మంత్ బిరధర్, యోగేశ్వర్‌రెడ్డి, గంధమల్ల గోపి, నవీన్, చింటూ, రాజేష్, క్రాంతికుమార్, మంజులవాణి తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని చర్లపల్లి పోలీసులు గుర్తించారు. చర్లపల్లి, భరత్‌నగర్ కాలనీ, శ్రీరామ్‌హోటల్ వద్ద రాళ్ల కుప్పపై 26 ఏళ్లున్న గుర్తు తెలియని యువకుడు విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు చర్లపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 8712332722, 8712662784, 8712578712.

అటకెక్కిన ఆహ్లాదం !

- నాడు స్వచ్ఛమైన నీటితో జలకళ
- నేడు గుర్రపుడెక్క దుర్వాసనతో..
- దయనీయంగా బండ చెరువు
- దోమలతో రోగాల బారిన పడుతున్న ప్రజలు



గుర్రపు డెక్కతో నిండిపోయిన బండ చెరువు



నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

> దాదాపు రెండు దశాబ్దాలకు ముందు స్వచ్ఛమైన నీరు, చేపలతో కళకళలాడింది. చుట్టుపక్కల బోర్లలో భూగర్భ జలాలు సంమృద్ధిగా ఉండటానికి కారణమైన ఈ చెరువు ప్రస్తుతం మురికికూపంగా మారింది. ఆహ్లాదం మాట దేవుడెరుగు.. చెరువు పక్కకు వెళ్తే దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
> – మౌలాలి

మల్కాజిగిరి నియోజకవర్గం ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని బండచెరువు దయనీయంగా మారింది. గతంలో చెరువును సందర్శించిన స్థానికులు, ప్రస్తుతం చెరువు దుస్థితిని చూసి ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చెరువు అభివృద్ధిని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆక్రమణలను పట్టింకోవడం లేదు..

కొంతమంది అక్రమార్కుల చేతుల్లో చెరువు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపు డెక్కతో అవస్థలు...

చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి, పచ్చిక మైదానాన్ని తలపిస్తోంది. ఇష్టానుసారంగా వ్యర్థాలను చెరువులో పారవేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది.

చెరువులోకి వ్యర్థాలు..

చెరువులోకి మురుగు, చెత్తా, చెదారం నిండటంతో దోమల బెడద అధికమవుతోంది. దోమల సమస్యతో చెరువు చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ.. అనారోగ్యానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటుహైడ్రా అధికారులు, జీహెచ్‌ఎంసీ దీనిపై చొరవ తీసుకుని బండచెరువు ఆక్రమణలను నియంత్రించడంతో పాటు చెరువును సుందరీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి



సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో బండ చెరువు మురికికూపంగా తయారైంది. గుర్రపుడెక్క, మురుగు, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బండ చెరువుకు పూర్వవైభవం తీసుకురావాలి

– రమేష్ తిరుమల్, స్థానికుడు

చెరువును సుందరీకరించాలి



చెరువులో మురికినీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలి. గుర్రపుడెక్క తొలగించి. వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుని, సుందరీకరణ పనులు చేపట్టాలి. అప్పుడే దోమలు సమస్య తీరడంతో పాటు ప్రజలకు ఆహ్లాదం అందుతుంది. ప్రజారోగ్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది.

– నరేష్, లల్వాణీనగర్ అధ్యక్షుడు

ఆహ్లాదంగా ఉందనుకుంటే పొరపాటే..



చెరువు ఒడ్డున వ్యర్థాలతో ఇలా..

రామంతాపూర్: పలు కాలనీలు, బస్తీల మధ్యలో ఉన్న చిన్న చెరువు చుట్టూ పచ్చని చెట్లతో చెరువు నిండా నీటితో కనువిందు చేస్తోంది. కానీ స్థానిక కాలనీలు, బస్తీల్లోని మురుగు వచ్చి చెరువులో చేరుతోంది. దీనితో పాటు చెరువులో చెత్త,చెదారం, పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలతో కాలుష్యకాసారంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చెరువు చుట్టు పక్కల కాలనీలో దోమలు విజృంభించి ప్రజలు అనారోగ్యం భారిన పడుతున్నారు. చెరువు పరిరక్షణకు జీహెచ్ఎంసీ సెక్యూరిటీగార్డులను నియమించినా ఫలితం లేకుండా పోతోందని, పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో వ్యర్థాలు చేరకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కోనసీమ అందాలను తలపిస్తున్న చిన్న చెరువు

స్థానిక సమస్యలు పరిష్కరించండి



ఉప్పల్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

హబ్సిగూడ: ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుకు కాలనీవాసులు తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్– 8లో కమ్యూనిటీహాల్‌లో సీనియర్ సిటిజన్స్‌కు అదనంగా ఓ గదిని నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై డీసీ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి గదిని నిర్మించేందుకు కృషిచేయనున్నట్లు హామీ ఇచ్చినట్లు చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇందర్‌సింగ్, మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రతినిధులు భరత్‌సింగ్, డీకేస్వామి, బుచ్చిరెడ్డి, మాధవరెడ్డి, కేవీ రాజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులున్నారు.

ఆక్రమణల తొలగింపు



కాప్రా: ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. పద్మశాలి టౌన్‌షిప్ మెయిన్ గేటు ఎదురుగా సాయిబాబానగర్ సమీపంలో సర్వేనంబర్ 710లో ప్రభుత్వ స్థలంలో పలువురు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు షెడ్లు నిర్మించి చిరువ్యాపారాలు సాగిస్తున్నారు. సోమవారం తహసీల్దార్ సుచరిత ఆదేశాలతో రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఎంతటివారిపైనైనా చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కాప్రా మండలంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షించడమే తమ కర్తవ్యమని ఆమె పేర్కొన్నారు.

నీటి ఎద్దడిపై చర్యలు తీసుకోవాలి



జలమండలి కార్యాలయం ప్రజావాణిలో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి/అల్వాల్: వేసవిలో నీటి ఎద్దడి తీర్చాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సైనిక్‌పురి జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జీఎం సునీల్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ నీటి సరఫరాలో అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి సరఫరాలో నాణ్యత, సమయపాలన పాటించాలని కోరామన్నారు. యూజీడీ పూడికలు త్వరితగతిన చేయాలని, పనిచేయని బోర్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గౌతంనగర్‌లో వాటర్ ట్యాంకర్ల ఫిల్లింగ్ చేపట్టి, చలివేంద్రాలకు ఉచితంగా నీటిని సరఫరా చేయాలని కోరామన్నారు.

◆ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో హార్టికల్చర్ చెట్లకొమ్మలను కొట్టివేయాలని, బాలసరస్వతీనగర్‌లో నాలాపనులు చేపట్టాలని, దోమల బెడదను నివారించాలని డీసీ రాజుకు వినతిపత్రం అందజేశారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

అల్వాల్: ఊరెళ్లొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ చేసిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం మా సంతోషికాలనీలో నివసించే చంద్రశేఖర్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. ఫిబ్రవరి 24న కుటుంబంతో కలిసి చెన్నై వెళ్లి సోమవారం కుమారుడు, కోడలు తిరిగొచ్చారు. గేటు తాళం తీసి లోపలికి వెళ్లగా ఇంటి తాళం పగలగొట్టి కనిపించింది. తలుపులు తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని సామగ్రి చిందరవందరగా పడిఉండటంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌రహిత సమాజంలో భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: మాదకద్రవ్యాల నివారణ, డ్రగ్స్ రహిత నాచారం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి నాచారంలో నో డ్రగ్స్ ఫోరం నాచారం దిశ కమిటీ సభ్యులు నేనావత్ రవినాయక్ ఆధ్వర్యంలో సమీక్ష– సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. యువత, కాలేజీ పిల్లలు ఎక్కువగా మాదకద్రవ్యాలు వినియోస్తున్నారని, వాటికి బానిసై యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు గురికాకుండా తల్లిదండ్రులు, కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, గ్రేటర్ బీఆర్‌ఎస్ నేత సాయి జెన్‌శేఖర్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, మోహన్‌రెడ్డి, టీడీపీ నేత రాంబాబు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సమస్యలను పరిష్కరిస్తాం

అల్వాల్: అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై డీసీ శ్రీనివాస్‌రెడ్డి చర్చించారు. ఇంటిపన్నును వీలైనంత వసూలు చేయాలని, సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలికవసతులపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏఎంసీ నర్సింహ్మారెడ్డి, ఈఈ శ్రీకాంతి అధికారులు పాల్గొన్నారు.

తల్లి మృతిపై కుమార్తె అనుమానం !

మల్కాజిగిరి: ఓల్డేజ్ హోమ్‌లో ఉన్న తల్లి చనిపోయిన ఘటనలో ఆమె కుమార్తె మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండికి చెందిన ఎం.ఎస్ గాయత్రి యాప్రాల్‌లో ఉంటున్న తన తల్లి భారతి (70)ని ఈనెల 1న వసంతపురి కాలనీలోని ఓ ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించింది. అంతకు ముందు గాయత్రి వద్దనే ఆమె ఉండేది. 2న సాయంత్రం హోమ్ నుంచి ఫోన్ చేసిన నిర్వాహకులు తల్లి మృతి చెందినట్లు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఆమె తల్లి మృతదేహాన్ని సీతాఫల్‌మండికి తీసుకెళ్తుండగా ఆమె మరో సోదరి ఉమామహేశ్వరి అనుమానం వ్యక్తం చేసింది. చిలకలగూడ పోలీసులకు సమాచారం అందడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఓల్డేజ్‌హోమ్ మల్కాజిగిరిలో ఉండటంతో ఈ ఘటనపై కుమార్తె ఫిర్యాదు చేసిందని, పోస్టుమార్టం అనంతరం అందజేస్తామని ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఆంజనేయులు (ఫైల్)

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్, తాండూర్, పొల్కుర్ గ్రామానికి చెందిన లింగారావు ఆంజనేయులు (33) వృత్తిరీత్యా డ్రైవర్. కాగా గత కొంతకాలం క్రితం నగరానికి వచ్చి డ్రైవింగ్ చేసుకుంటూ బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 2న యాప్రాలోని తన మిత్రుడి ఇంట్లో శుభకార్యానికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో హెచ్‌బీకాలనీ, తినేత్ర బార్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు.

తప్పించుకుతిరుగుతున్న నిందితులపై.. నాన్‌బెయిలబుల్ వారెంట్లు

అల్వాల్: పలు కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న వ్యక్తులపై మేడ్చల్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి నాన్‌బెయిల్ వారెంట్లు జారీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళంజిల్లా టెక్కలి గ్రామానికి చెందిన రాము (25)పై 397సెక్షన్ల కింద కేసులు ఉన్నట్లు చెప్పారు.తప్పించుకుతిరుగుతున్న అతడు ఈనెల 10వ తేదీలోగా మేడ్చల్ జిల్లా కోర్టు, అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని లేదంటే వారి ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు.

గిరిజన బస్తీలో గ్రంథాలయం ఏర్పాటు



మాట్లాడుతున్న కార్పొరేటర్ చేతనాహరీష్

హబ్సిగూడ: డివిజన్‌లోని గాంధీ గిరిజన బస్తీలో నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ చేతనాహరీష్ మాట్లాడుతూ.. వెరిక్స్ అనలాటిక్స్ కంపెనీ సీఎస్‌ఆర్ అందించిన సుమారు రూ.2 లక్షల నిధులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులతోపాటు వివిధ పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థులకు గ్రంథాలయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు ప్రవీణ్ సంద్రీ, సూర్య ప్రకాష్, బీజేపీ నేతలు సంజయ్‌పటేల్, సుమన్‌రావు, ప్రధాన కార్యదర్శులు ఎల్లాచారి, ప్రవీణ్, బండి పద్మ, రవీందర్ రెడ్డి, గడ్డం సాయి తదితరులున్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్

బోడుప్పల్: 13వ డివిజన్ పరిధి అంబేద్కర్‌నగర్ క్వార్టర్స్ కాలనీలో సోమవారం తాగునీటి పైపులైన్ పనులను మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తిచేసి నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాలనీ అధ్యక్షులు విష్ణుగౌడ్, కాలనీవాసులు గౌడిశాల శ్రీనివాస్‌గౌడ్, పర్వతాలు, మహిళలు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి




మాట్లాడుతున్న కమిషనర్ శైలజ

కాప్రా: ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌లో ప్రభుత్వం కల్పిస్తున్న 25శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాప్రా మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ సూచించారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్లానర్లు, ఆర్కిటెక్ట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ జగన్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పించిందని పేర్కొన్నారు. ఈ అవకాశం 2025 మార్చి 31లోగా క్రమబద్ధీకరణ రుసుము చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రజల సందేహాల కోసం కాల్‌సెంటర్, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. సర్కిల్ డిప్యూటీ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, న్యాక్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీల్డ్ వెరిఫికేషన్‌పై సమావేశం..

బోడుప్పల్: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్స్ ఫీల్డ్ వెరిఫికేషన్‌పై సోమవారం కమిషనర్ శైలజ వివిధ డెవలపర్స్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై 25 శాతం రాయితీ కల్పించిందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో విస్తృత స్థాయి ప్రచారంతో పాటు కాల్‌సెంటర్, హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రొహిబిటెడ్ ల్యాండ్స్, వాటర్ బాడీస్‌కు 200 మీటర్లకు బయట ఉన్న వాటికి తక్షణం 2025 మార్చి 31వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులు, వార్డు అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎల్ 1 లాగిన్‌లో 7506 ప్లాట్ల వెరిఫికేషన్ కోసం 27 మంది వార్డు ఆఫీసర్లను ఫీల్డ్‌కు పంపించామన్నారు. 2431 ప్లాట్లకు అప్రూవల్ సిటిజన్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. 2020లో దరఖాస్తుదారులందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ సెక్షన్ అధికారులు, సెక్షన్ అసిస్టెంట్‌లు, వార్డు ఆఫీసర్లు, ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డెవలపర్స్ పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

కాప్రా: జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వీఎస్ బోస్ డిమాండ్ చేశారు. సోమవారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. శానిటేషన్, కార్మికులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెరగడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే హైకోర్టు తీర్పును కూడా అమలుచేయడం లేదని ధ్వజమెత్తారు. పనివేళల్లో కార్మికులకు కావాల్సిన రక్షణ పరికరాలు కూడా ఇవ్వడంలేదన్నారు. కార్మికులతో చెరువుల్లో గుర్రెపు డెక్క తొలగించడంతో కార్వాన్ ప్రాంతంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారని తక్షణమే కాప్రా సర్కిల్‌లో ఆ పద్ధతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. గుర్రెపుడెక్క తొలగింపునకు అధునాతన యంత్రాలు ఉపయోగించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. అనంతరం సమస్యలపై డిప్యూటీ కమిషనర్ జగన్‌కు వినతిపత్రం అందజేశారు. శంకర్‌రావు, సాయిలు, సాలయ్య, జాన్, శివయ్య, నర్సింహ, శివశంకర్, ఎల్లయ్య, పోచయ్య, రాజు, రాములు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.